

కథా కౌముది

# ఓ తండ్రీ, ఓ కొడుకూ, ఓ గాడిద కథ

## శెట్టిపల్లి అరుణా ప్రభాకర్

వసుంధర, వామన్ రావుల పెళ్లి జరిగి పది సంవత్సరాలయింది.

ఈ పదేళ్ళ బట్టీ వాళ్ళిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉన్నారంటే , విద్యార్థికల్పతరువు పుస్తకం తాలూకు వాళ్ళు వాళ్ళ పర్యాయపదాల లిస్టులో అన్యోన్యత పక్కన వీళ్ళిద్దరిపేర్లూ రాసేసుకున్నారట. ఇక శంకరనారాయణ, దాచేపల్లి వాళ్లయితే ఏకంగా తమ నిఘంటువుల నుంచి అన్యోన్యత అనే పదం ఎత్తేసి వసుంధరా, వామన్ రావుల జంట పేరు రాసేసే ఉద్దేశంలో ఉన్నారని తెలిసింది.

మామూలుగా పెళ్ళయిన కొన్ని రోజుల తరువాత ఇళ్ళల్లో యాక్టివ్ పాత్ర పోషించే అప్పడాలకర్ర వాళ్ళింట్లో నిజంగా వంటగదికే పరిమితం అయింది. మరచెంబులో అల్ప పీడనాలూ, చాయ్ కప్పులో తుఫాన్లూ లాంటివి ఇక్కడ లేనేలేవు. వీళ్ళ సరసాలు రోజూ రాత్రిళ్ళు పడగ్గది కిటికీలోంచి తొంగి చూసి చూసి సిగ్గేసిన చందమామకి ప్రతిరోజూ మబ్బు వెనకాల మొహం దాచుకోవడానికి మొహమాటపడి సూర్యుడితో బేరం పెట్టాడు, తాను పగలూ, సూర్యుడు రాత్రీ వచ్చేటట్టు మార్చుకుందామని. 'పిచ్చివాడా, అప్పుడైనా నువ్వుండేదే రాత్రీ నేనుండేదే పగలూ అయ్యే తీరుతుందిగదా'ని సూర్యుడనేసరికి మరింత సిగ్గేసి ఊరుకున్నాడు.

ఇంటికి తొందరగా వెళ్దామని ఆఫీసులో గడియారాన్ని ఎవరూ చూడకుండా ముందుకు తిప్పేసే వామన రావూ, జస్ట్ మబ్బులు పట్టి చీకటైతే మొగుడొచ్చే టైమైందని సింగారించుకుని వాకిట్లో నిలుచునే వసుంధరా పెళ్ళయిన పదేళ్ళూ పది రోజుల్లా గడిపేసి ఉంటారు.

కుండెడు పాలల్లో చిటికెడు ఉప్పు కలిస్తే విరిగిపోతాయేమో గానీ వాళ్ళ సంసారమనే క్షీరసాగరంలో ఏకంగా లవణసముద్రం కలిసినా చెక్కు చెదరదు అని గిట్టినవాళ్ళు అనుకుంటారు.

అంతెందుకు, చుట్టాలింట్లో పెళ్లిళ్లయితే కొత్తదంపతుల్ని అందరూ సీతారాముల్లా కలిసిమెలసి ఉండండని దీవించడం మాని, వసుంధరా వామన్రావుల్లా కలిసి ఉండండని దీవించడం అలవాటయింది.

అలాంటి అన్యోన్య దంపతులకి అనుకోకుండా చుట్టాల దగ్గర్నుంచి పెళ్లి పిలుపు వచ్చింది. కరీంనగర్ జిల్లాలో అటు టౌనూ ఇటు పల్లే కానీ ఒకానొక ఊళ్ళో దగ్గర బంధువుల ఇంట పెళ్లి.

ఎక్కడ తమ ఏకాంతానికి భంగం కలుగుతుందో అని పెళ్ళిళ్లూ తదితర ఫంక్షన్లూ కొత్త పెళ్లిజంట ముసుగులో తప్పించుకున్నా, 'ఇంకెన్నాళ్ళు తలుపులు బిగించుకుని ఇంట్లో కూర్చుంటారు, పెళ్ళయి పదేళ్ళయింది ఇంకేం చిన్నపిల్లలు వచ్చేయండి పెళ్ళికి' అని అవతలి మనిషి దబాయించి నప్పుడు 'అయ్యో అప్పుడే పెద్ద వాళ్లమయిపోయామా' అని కలుక్కుమన్నాయి ఇద్దరి మనసులూ.

పెళ్ళికి వెళ్ళక తప్పదని ఇద్దరూ కలిసి తేల్చుకుని తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

ఒకరోజు ముందే తయారయ్యి లెస్ లగేజ్ మోర్ కంఫర్టనుకుని ఒకే ఒక్క సూట్కేసు నిండుగా సర్దుకుని బయల్దేరి పొద్దున్నే కరీంనగర్లో దిగి ఊరి బస్సెక్కి అక్కడ దిగేసరికి ఉదయం పదిన్నర అయింది.

ఆ ఊళ్ళో అడుగుపెట్టగానే తెలిసింది టాక్సీలు కాదుకదా కనీసం ఆటో అయినా అక్కడ ఉండదని! బస్ స్టాండ్ నుంచి ఒక కిలో మీటరు నడవాల్సి ఉంటుందని తెలుసుకున్నారు.

దోవ కనుక్కుని నడక సాగించారు.

మట్టి రోడ్డు, ఒడుదుడుకులు. జాగ్రతగా నడచుకుంటూ వెళ్తున్నారు.

జనాలు ఎదురు పడుతూన్నా ఒక్కరూ తెలిసిన వాళ్ళు లేరు.

వసుంధర సూట్కేసు పట్టుకుని వెనక నడుస్తుంటే వామన్ రావు ముందర నడుస్తున్నాడు.

ఇద్దరు పెద్ద మనుషులు వీళ్ళని (ఎగాదిగా) చూస్తూ దాటుకుని వెళ్ళిపోయారు.

కైలాసం నుంచి కాలినడకన వచ్చిన పార్వతీ పరమేశ్వరుల్లా ఉన్నట్టున్నాము అనుకుంది వసుంధర.

రతీ మన్మధుల్లా ఉన్నాం, దిష్టి తగుల్తుందేమో అనుకున్నాడు వామన్ రావు.

"అరె చిన్నప్పటినుంచి మనం ఎంత కష్టపడేటోళ్లంరా. ఎన్ని పన్లు చేసెటోల్లం. ఒక్క సూట్కేసు మొయ్యలేక ఆడదానితోటి మొయిస్తున్నాడు చూసినవా. "

"నీకు తెలువదురా. ఈ కాలం కుర్రోళ్ల చేతులు కంప్యూటర్లు వాయించేతందుకే గానీ బరువులు మోసేతందుకు కాదురా."

వినిపించింది వెనకనుంచి.

వామన్ రావు కొంత ఇబ్బందిగా కదిలి నడక సాగించాదు.

నలుగురైదుగురు ఎదురు పడ్డారు. అందరి మొహాల్లోనూ ఇందాకటి పెద్దమనుషుల మాటల తాలూకు భావాలే తోచినై ఇద్దరికీ.

లాభం లేదనుకుని వామన్రావు, “ఆ సూట్కేసు ఇటివ్వు నేను పట్టుకుంటాను. అసలు ముందే తీసుకుందామనుకున్న గానీ నువ్వెక్కడ బాధ పడతావోనని ఊర్కున్నా“ అన్నాడు.

“భలేవాళ్లే”, టీవీ రిమోట్ కీ సూట్కేసుకీ తేడా చూపించలేని భర్త అమాయకత్వానికి మురిసిపోతూ అందించింది.

ఇప్పుడు వసుంధర ముందు నడుస్తుంటే వామన్రావు సూట్కేసు మోస్తూ నెమ్మదిగా వెనకాల నడుస్తున్నాడు.

మరో పెద్ద మనిషీ, ఓ కుర్రాడూ ఎదురు పడ్డారు.

ఇద్దర్నీ దాటుకుని వెళ్ళాక పెద్దమనిషి, “ ఏరా, రాముడి వెనకాల సీత నడిచినట్టు విన్నాం గానీ సీత వెనకాల రాముడు నడిచినట్టు వినలేదురా “....

ఇలా కాదనుకుని వామన్ రావు తాను ముందు నడుస్తూ వసుంధరని వెనకాల రమ్మన్నాడు.

మళ్ళీ కొంత దూరం వెళ్ళాక ఇంకో ఇద్దరు, మరీ చాదస్తపు శాల్తీలెమో,

“కాలం ఎట్లా మారిందో చూస్తివా”

రెండో అతను ఆకాశం వంక చూశాడు వర్షమేమన్నా రాబోతుందాని.

“ముందుకి చూడు. మొగుడితో మూటలు మోపిస్తూ ఆడది ఎంత దర్జాగా వెళ్తోందో”

వసుంధర ముందుకీ, వామన్ రావు వెనక్కీ తలలు తిప్పి ఒకర్నొకరు చూసుకున్నారు.

ఇద్దరూ పక్క పక్కన నడుస్తూ సూట్కేసు చెరో హాండిలూ పట్టుకుని నడవసాగారు.

కంకర రోడ్డు మీద వసుంధరా, అంచున మట్టిలో వామన్ రావూ నడుస్తూ ఉంటే ఎత్తు పల్లాలకి సూట్కేసు ఎగిసి పడే అలలమీద ఉయ్యాలలా ఊగే సంసారనౌకని తలపించింది.

“అయినా ఇదింత బరువుందేమిటి, నాకు సర్దింది ఒక్క జతేగా! మిగతావన్నీ నీవే గామోసు. ఓ మేకప్ సామాన్ల దుకాణమూ, ఓ పట్టు చీరల దుకాణమూ ఉన్నట్టున్నాయి “

“మొగాళ్లయితే లుంగీ కట్టుకుని ఏమూలకో కూచుని పేకాటేగా ఆడేది. ఆడాళ్ళు పెళ్ళికి వెళ్తూంటే ఆ మాత్రం ఉండొద్దేమిటి. నావి మీరనుకున్నన్ని లేవులెండి.”

“................”

“ఒక పూటకి ఒక్క జత సరిపోదూ జెంట్స్ కి.”

“ఎందుకు సరిపోదూ, నా పెళ్లే ఒక్క జతతో అయింది.”

"దానికేవరేం జేస్తారూ. మీరేగదా ఒక్కోజతా ఒక్కోరకం కొలతల్తో కుట్టించింది. ఇంకోజత వేస్కున్నప్పుడు చార్లీ చాప్లిన్లా అనిపించి వద్దంటి. "

"టైలరు మీవోడేగా "

"కొలతలిచ్చేటప్పుడు సారు అటూఇటూ కదిలేడమ్మా అన్నాడు. కుదురే లేదు మనిషికి!"

"# !"

"# @@@ ?"

&&&&& ్్్్్ ★★★★★ ??"

"₹₹₹$ !!!!!!"

" అవునవును, మరి ఫలానా విషయం పక్కింటి రెడ్డి గారికెట్లా తెలిసిందో!"

"అరె, ఆయన భార్య క్లోజ్ గా ఉంటుందని ఏవో కష్టసుఖాలు మాట్లాడుకుంటాం. అది తప్పయింది"

"నా కష్టం నీకు సుఖమైందని చెప్పరాదూ"

"అవేం మాటలు ?. నేనట్లా అన్నానా?"

"అన్నావని నేనన్నానా. అనుకున్నావేమో అనుకున్నా" వరదలా రాబోయే కొంటె నవ్వు చూసేవాళ్ళ తాత్కాలికానందంకోసం ఆపుకుంటూ,

"ఇన్నాళ్లూ మీ మైండ్ లో ఏవో పెట్టుకున్నారు", ఎవరన్నారు ఆడాళ్ళకి కన్ను గీటడం రాదని,

"అవకాశం దొరికింది పెడర్థాలకి", మళ్ళీ నవ్వాపుకుంటూ,

"అర్థం చేసుకోలేక" , కింది పెదవిని ముని పంట నొక్కుతూ కనిపించకుండా నవ్వే నవ్వు అందమే వేరు.

"నాదే బుద్ధి తక్కువ"

"ఛా.."

"ఛాఛా..."

"ఛీ.. "

"ఛీఛీ..."

సంసార నౌకని చుట్టుముట్టే పొరుగు జోక్యాల సుడిగాలికి తమ మధ్యలోకి చీమనైనా దూరనివ్వని అనుబంధపు తెరచాప అడ్డువేయగల వివేకం ఆడించిన చిన్న ప్రణయ నాటకం అయి పోయాక⋯⋯.

'ఆడుతూ పాడుతూ అడుగేస్తుంటే ఆనందానికి కరువేమున్నదీ
ఇద్దరమొకటై చేతులు కలిపితే అంత బరువేమున్నదీ
దారిన పోయే దానయ్యలతో పనియేమున్నదీ మనకూ పనియేమున్నదీ....'

అని పాడుకుంటూ పోయే జంటను చూసి ఉడుక్కోవడం వచ్చేపోయేవాళ్ళ పనైపోయింది.

COMMENTS